

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

పార్వతీపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం ఆరు గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించనున్నారు. దీని పర్యవేక్షణకు గాను ఇప్పటికే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. జిల్లాలో 1,43,398 వరకు వివిధ రకాల పింఛన్లు ఉండగా, రూ.59.58 కోట్లు పంపిణీ చేయనున్నారు. గ్రామాల వారీగా సిబ్బంది మ్యాపింగ్ ఇప్పటికే పూర్తయ్యిందని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం..
- రూ.200 కోట్లతో రహదారులు, కాలువల నిర్మాణం
- మాతాశిశు మరణాలు, రక్తహీనత నివారణకు చర్యలు
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): 'మన్యం'లో మారుమూల గిరిజన గ్రామాలతో పాటు మైదాన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారుల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ' సుమారు రూ.200 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణాలు చేపట్టనున్నాం. గిరిజన, మైదాన ప్రాంతాల్లో రక్తహీనత నివారణకు కృషి చేస్తున్నాం. జిల్లాలో సుమారు 360 మంది వరకు సికెల్ సెల్ ఎనిమియా వ్యాధి బాధితులు ఉన్నారు. వీరికి ఎప్పటికప్పుడు రక్తమార్పిడి అవసరం. ఇందుకోసం పీహెచ్‌సీ, సీహెచ్‌సీల వద్ద రక్తమార్పిడి జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. డీఆర్‌డీఏ, నాబార్డు తదితర శాఖల ద్వారా మహిళా సంఘాల స్వయం ఉపాధికి సహకారం అందిస్తాం. బ్యాంకుల లింకేజీ రుణాలతో పాటు స్త్రీ నిధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మహిళా సంఘాల బలోపేతం చేయాలనే లక్ష్యంగా పని చేస్తున్నాం. జీడి ప్రోసెసింగ్ యూనిట్ ఏర్పాట్లుకు చర్యలు తీసుకుంటున్నాం. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తాం. ఆర్ఎస్ఈటీవై ద్వారా వివిధ రంగాల్లో నిరుద్యోగులకు శిక్షణ అందిస్తాం.. ఇందుకోసం జిల్లా కేంద్రంలో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. పట్టణంలోని కొత్తవలస ప్రాంతంలో ఎకరా భూమిని ఆర్ఎస్ఈటీవై సంస్థకు అప్పగించాం. జిల్లాలో జగత్ పల్లి, అడ్డాపుశీల, తదితర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ఇందుకు అవసరమైన లింకు రహదారులకు తగు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. గిరిజన, మైదాన ప్రాంతాల్లో మాతాశిశు మరణాల నివారిస్తాం. గుమ్మలక్ష్మీపురం, సాలూరులో గిరిజన గర్భిణుల వసతి గృహాలను పరిశీలించి.. వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు గాను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ద్వారా సహకరిస్తాం. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ప్రతి మండలానికి సోలార్ వీధి దీపాలు అందిస్తున్నాం. మొదటి విడతగా 500 సోలార్ వీధి దీపాలు అందించనున్నాం. పార్వతీపురం, సీతంపేటలో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఆసుపత్రుల అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. జిల్లావాసులకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని వైద్యశాఖను అప్రమత్తం చేశాం. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. గిరిజన ఇంజనీరింగ్ కళాశాల పనుల వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం. వైద్య కళాశాల ఏర్పాటుకు సంబంధించి.. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావల్సి ఉంది. జిల్లాలో తాగునీటి సమస్య పెద్దగా లేదని, ఎక్కడైనా ఉంటే వెంటనే పరిష్కరిస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరేలా పనిచేయాలని అన్ని శాఖల అధికారులకు సూచించాం. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల ద్వారా గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, గిరిజనులు ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేయనున్నాం. సాగునీటి కాలువల్లో జంగిల్ క్లియరెన్స్‌కు నిధులు మంజూరు చేశాం. జిల్లాలో 16 గ్రంథాలయాలు ఏర్పాటు చేయనున్నాం. పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగులకు అవసరమైన మెటీరియల్‌ను వాటిల్లో ఉంచుతాం. పూర్ణపాడు-లాబేసు, సీతానగరం వంతెనల నిర్మాణం, తదితర అభివృద్ధి పనులపై దృష్టి సారించాం.' అని ఆయన తెలిపారు.

గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా..

- ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు
- ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకానికి గ్రీన్ సిగ్నల్
- పూర్తిస్థాయిలో ఫీడర్ అంబులెన్స్‌ల ఏర్పాటు
- గర్భిణుల వసతిగృహాలకు పూర్వ వైభవం
- వైటీసీల ద్వారా శిక్షణ.. గిరి పుత్రులకు ట్రైకార్ రుణాలు
- ఐటీడీఏల ద్వారా మెరుగైన సేవలు అందించాలని ఆదేశం



గుమ్మలక్ష్మీపురంలో గిరిజన గర్భిణుల వసతిగృహం

పార్వతీపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల సచివాలయంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. గిరిజన సంక్షేమ శాఖపై సమీక్షించారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ కాలంలో గిరిజనులకు దూరమైన సేవలను తిరిగి అందుబాటులోకి తేవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సమస్యలు, గిరిజన విద్యార్థులు, వారి ఆరోగ్య పరిస్థితులు, ఆశ్రమ పాఠశాలలు, వైటీసీలు, గిరిజన గర్భిణుల వసతి గృహాలు, విద్య, వైద్య సేవలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. మొత్తంగా కూటమి సర్కారు గిరిజనుల సంక్షేమంపై దృష్టి సారించడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకం...

పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎంలను నియమించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యాలపై పర్యవేక్షణ ఉండాలని, అనారోగ్యాలకు గురైన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులకు సూచించారు. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎంలు ఉండేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని తొలగించింది. దీంతో ఆశ్రమ పాఠశాలలో పిల్లల ఆరోగ్యాలపై పర్యవేక్షణ కొరవడింది. తరచూ అనారోగ్య సమస్యలతో గిరిజన విద్యార్థులు మృతి చెందుతున్నారు. ఈ నేపథ్యంలో నూతన సర్కారు దీనిపై దృష్టి సారించింది. ఆశ్రమ పాఠశాలల్లో తిరిగి ఏఎన్ఎంల నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

డోలీల మోత ఉండరాదు...

ఏజెన్సీ ప్రాంతాల్లో ఇకపై డోలీల మోతలు ఉండరాదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజన సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఫీడర్ అంబులెన్స్‌ల ద్వారా గిరిజనులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చి.. వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకునే వారు. దీంతో వారికి డోలీ కష్టాలు ఉండేవి కావు. కానీ వైసీపీ పాలనలో ఫీడర్ అంబులెన్స్‌లు మూలకు చేరాయి. ఈ నేపథ్యంలో ఫీడర్ అంబులెన్స్‌లు గిరిజన ప్రాంతాల్లో ఉండాలని, అవసరమైతే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

వైటీసీల ద్వారా శిక్షణ కార్యక్రమాలు...

గత వైసీపీ సర్కారు హయాంలో నిర్వీర్యమైన వైటీసీలకు పూర్వ వైభవం తేవాలని సీఎం చంద్రబాబు సూచించారు. గిరిజన యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇచ్చి.. ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో ఉన్న వైటీసీలపై దృష్టి సారించాలన్నారు.

ట్రైకార్ రుణాలు పునఃప్రారంభం...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు సబ్సిడీపై ట్రైకార్ రుణాల అందించేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికి మంగళం పాడేసింది. అయితే దీనిపై దృష్టి సారించిన టీడీపీ ప్రభుత్వం గిరిపుత్రులకు సబ్సిడీపై ట్రైకార్ రుణాలను అందించాలని నిర్ణయించింది. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన గర్భిణుల వసతిగృహాలకు మోక్షం

గుమ్మలక్ష్మీపురం: గత వైసీపీ సర్కారు తీరుతో జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, సాలూరులో ఉన్న గిరిజన గర్భిణుల పరిస్థితి దయనీయంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దేశంలోనే ప్రత్యేకంగా గుర్తింపు పొందిన ఈ వసతిగృహాలను వైసీపీ సర్కారు పూర్తిగా గాలికొదిలేసింది. ఐదేళ్ల కాలంలో నిధులు మంజూరు చేయకపోగా.. సిబ్బంది జీతాలను కూడా సక్రమంగా చెల్లించలేదు. భోజనాలు పెట్టే ఏజెన్సీలకు కూడా సకాలంలో బిల్లులు చెల్లించ లేదు. దీంతో వసతిగృహాల నిర్వహణ గాడి తప్పింది. ఆయా వసతిగృహాలకు వచ్చే వారి సంఖ్య క్రమంగా తగ్గింది. అయితే ఇకపై ఇటువంటి పరిస్థితి ఉండకూడదని నూతన సర్కారు సంబంధిత అధికారులను ఆదేశించింది. దీంతో గిరిజన గర్భిణుల వసతి గృహాలకు మోక్షం లభించినట్లయ్యింది. ప్రసవానికి ముందే గిరిజన గర్భిణులను వసతిగృహాలకు తరలించాలని, సక్రమంగా వసతిగృహాలను వాటిని నిర్వహించాలని సీఎం చంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, పౌష్టికాహారం అందించాలని సూచించారు.



కొత్త రైల్వే లైన్‌పై ఆశలు

- ఏర్పాటుపై పార్లమెంట్‌లో ప్రస్తావించిన విజయనగరం ఎంపీ
- గతంలో పూర్తయిన సర్వే
- మంజూరైతే జిల్లా వాసులకు తప్పనున్న ఇబ్బందులు

సీతంపేట, జూలై 31: విజయనగరం నుంచి పలాస, రాజాం ప్రాంతాలను కలుపుతూ సీతంపేట, పర్లాకిమిడి మీదుగా కొత్తగా రైల్వేలైన్ ఏర్పాటుపై జిల్లా వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఇటీవల పార్లమెంట్ సమావేశంలో కొత్త రైల్వేలైన్ ఏర్పాటు అంశాన్ని ప్రస్తావించడంతో మళ్లీ ఇది చర్చనీయాంశమైంది. 2010లో దీనిపై కేంద్ర ప్రభుత్వం సర్వే నిర్వహించింది. 142 కిలోమీటర్ల మేర రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని భావించింది. అయితే మధ్యలో వంశధార, నాగావళి నదుల వద్ద, కొండ మార్గం గుండా గెడ్డలు, వాగుల్లో పలుచోట్ల భారీ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. దీంతో సర్వే అనంతరం రైల్వేశాఖ పునరాలోచనలో పడింది. దీంతో ఈ కొత్త రైల్వే మార్గం కార్యరూపం దాల్చలేదు. అయితే ఈ అంశాన్ని ఎంపీ మరోసారి పార్లమెంట్‌లో ప్రస్తావించడంతో ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిర్వహించిన సర్వే ఆధారంగా రైలు మార్గం మంజూరైతే అటు ఒడిశా, ఇటు ఆంధ్రా వాసుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. కాగా సీతంపేట, చాపర, కొత్తూరు, పాలకొండ, రాజాం ప్రాంతాలకు చెందిన వారు ఇకపై చీపురుపల్లి, ఆమదాలవలస, పార్వతీపురం వెళ్లి రైలు ఎక్కాల్సిన అవసరం ఉండదు. అదేవిధంగా గిరిజనులు తమ అటవీ ఉత్పత్తులను సులభంగా పట్టణ ప్రాంతాలకు తరలించే అవకాశం ఉంది.

సర్వే డీపీఆర్‌కు కేంద్రం ఆమోదం

విజయనగరం నుంచి రాజాం మీదుగా పలాసకు కలుపుతూ రైల్వే లైన్ నిర్మాణ సర్వేకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్రం ఆమోదించింది. విజయనగరం నుంచి రాజాం, పాలకొండ, కొత్తూరు, పర్లాకిమిడి, మెళియాపుట్టి మీదుగా పలాసకు 142 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా సర్వేకు సంబంధించి డీపీఆర్‌ను ఆమోదించింది. ఈ రైల్వేలైన్‌తో ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలతో పాటు ఒడిశాలోని ఒక జిల్లాకు ప్రయోజనం చేకూరనుంది. ప్రజా రవాణాతో పాటు పారిశ్రామికాభివృద్ధి, గిరిజన ఉత్పత్తుల రవాణా, మార్కెటింగ్‌కు మరింత అనుకూలత ఏర్పడనుంది. పర్యాటకంగానూ కూడా మరింత అభివృద్ధికి అవకాశం కలగనుంది.

ఆత్మలకు పింఛన్లు

- సామాజిక తనిఖీలో బయటపడ్డ అక్రమాలు

కురుపాం, జూలై 31: కురుపాం మండలంలో ఆత్మలకు పింఛన్లు ఇచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సామాజిక తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. నీలకంఠాపురంతో పాటు పలు పంచాయతీల్లో చనిపోయిన వారిట పింఛన్ సొమ్ము డ్రా చేసినట్లుగా అధికారులు గుర్తించారు. ఆ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో 55 మంది చనిపోగా వారిలో 39 మంది బ్యాంకు ఖాతాల్లో రూ.6.93 లక్షలను జమ చేశారు. అదే పంచాయతీలో మరో 16 మంది మృతుల పేరిట రూ.4.52 లక్షలు డ్రా చేసి పింఛన్లు పంపిణీ చేసినట్లు రికార్డుల్లో చూపించారు. బయోమెట్రిక్ పని చేయని చోట వలంటీర్లు మాన్యువల్‌గా ఇలా పింఛన్లు ఇచ్చినట్లుగా తెలిసింది. ఇదిలా ఉండగా ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులకు చెందిన కుటుంబ సభ్యులకు నిబంధనలకు విరుద్ధంగా పింఛన్లు అందించారు. వారి బ్యాంకు ఖాతాల్లో రూ.36 వేలు జమ చేసినట్లు బుధవారం కురుపాంలో జరిగిన ప్రజావేదికలో ఎస్ఆర్‌పీ దాసు తెలియజేశారు. దీనిపై సమగ్ర నివేదికను తయారుచేసి.. డీఆర్‌డీఏ పీడీకి పంపించనున్నట్లు చెప్పారు.

8న ఎస్ఎంసీల ఎన్నికలు

నేడు నోటిఫికేషన్ విడుదల



ఉల్లిభద్ర జడ్పీ హైస్కూల్

పార్వతీపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి)/గరుగుబిల్లి/ సాలూరు రూరల్: జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ)ల ఎన్నికలకు ప్రభుత్వం నేడు షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు డీఈవో జి.పగడాలమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికైన ఎస్ఎంసీల పదవీ కాలం ముగిసింది. దీంతో కొత్త కమిటీల ఎన్నికకు విద్యా శాఖ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు కమిటీ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్, సభ్యుల ఎన్నికలకు గురువారం ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ విడుదల కానుందని, మధ్యాహ్నం రెండు గంటలకు ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ఉంచుతారని తెలిపారు. 5న ఉదయం 9 గంటల నుంచి పది గంటల వరకు ఓటరు జాబితాలపై అభ్యంతరాలు స్వీకరిస్తారని చెప్పారు. అదే రోజు సాయంత్రం 3, 4 గంటల మధ్య తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారన్నారు. 8న ఎన్నికలు నిర్వహించనున్నారని తెలిపారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి మొదటి సమావేశాన్ని నిర్వహిస్తారని వెల్లడించారు.

ఎన్నిక ఇలా..

ఎన్నికల నిర్వహణకు విధిగా 50 శాతం మేర తల్లిదండ్రులు, సంరక్షకులు హాజరుకావాల్సి ఉంది. కోరం ఏర్పాటుకు సంబంధించి హెచ్ఎంలు సమయాన్ని నిర్ణయిస్తారు. చేతులెత్తే విధానంలో ఎన్నిక నిర్వహించ నున్నారు. వివాదం ఉన్నట్లయితే రహస్య బ్యాలెట్ విధానాన్ని అమలు పర్చనున్నారు. ఎస్ఎంసీ ఎన్నికల్లో తల్లిదండ్రుల్లో ఒకరు మాత్రమే ఓటు వేయడానికి అర్హులు. పలు క్లాసుల్లో పిల్లలు కలిగిన తల్లిదండ్రులు ప్రతి తరగతి ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హులు. తరగతిని యూనిట్‌గా తీసుకుని ముగ్గురు సభ్యులను ఎన్నుకోవలసి ఉంటుంది. వీరిలో ఇద్దరు మహిళలు, ముగ్గురిలో ఒకరు విధిగా ఎస్సీ, ఎస్టీ తెగలకు చెందిన వారు ఉండాలి. మరొకరు బీసీ లేదా ఓబీసీ, మైనార్టీ వర్గానికి చెందిన వారు ఉండాలి. తరగతిలో ఆరుగురు విద్యార్థులు లేకుంటే వీరిని మరొక తరగతిలో విలీనం చేసి ఎన్నుకోవలసి ఉంటుంది. ఎన్నికల అధికారిగా సంబంధిత పాఠశాల హెచ్ఎంలు, పరిశీలకులుగా తహసీల్దార్, ఎంపీడీవో, వీఆర్వో, వీఆర్ఏలు ఉంటారు. ఎన్నికల నిర్వహణ పూర్తయిన తర్వాత 8న ఎంఎస్‌సీ రిజిస్టర్లలో సభ్యుల వివరాలు పొందుపర్చి వారితో సంతకాలు చేయించాల్సి ఉంది. ఈ సమాచారాన్ని ఎంఈవోలకు తెలియజేయాలి. ఎన్నికైన సభ్యుల పదవీ కాలం రెండేళ్ల పాటు ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా 1582 పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో సుమారుగా 94 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

ప్రతి ఎకరాకూ నీరు

- రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- మంత్రి సంధ్యారాణి
- వీఆర్ఎస్ నుంచి నీరు విడుదల



వీఆర్ఎస్ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

మక్కువ: ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. బుధవారం శంబర గ్రామ సమీపంలో ఉన్న వెంగళరాయసాగర్ (వీఆర్ఎస్) జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే కూటమి సర్కారు ధ్యేయమని తెలిపారు. ' రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకుని.. లాభదాయకంగా సాగు చేపట్టాలి. ప్రభుత్వం సకాలంలో విత్తనాలు, ఎరువులు అందిస్తుంది. జైకా నిధులతో ప్రాజెక్టు ఆధు నికీకరణ పనులు జరుగుతున్నాయి. హెడ్ వర్క్సులో మట్టికట్టు, రక్షణగోడ, జన రేటర్ రూమ్, గేట్ల మరమ్మతులు, తూముల పనులు చేశారు. ప్రాజెక్టు ద్వారా మక్కువ, బొబ్బిలి, సీతానగరం మండలాల పరిధిలోని 24,700 ఎకరాలకు సాగునీరు అందుతుంది. కూటమి ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.' అని ఆమె చెప్పారు.

నేడు పెద్దగెడ్డ నీరు విడుదల

పాచిపెంట : పెద్దగెడ్డ జలాశయం నుంచి గురువారం సాగునీరు విడుదల చేయనున్నారు. కుడి ప్రధాన కాలువ ద్వారా 7,500 ఎకరాలు, ప్రాజెక్టు అనుసంధానంగా ఉన్న కర్రివలస వేగావతి ఆనకట్ట కుడి, ఎడమ కాలువల ద్వారా 4,500 ఎకరాలకు సాగునీరు విడిచిపెట్టనున్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తదితరులు హాజరు కానున్నారు.

వైసీపీ ఏం చేసింది?

వీఆర్ఎస్ అభివృద్ధికి గత వైసీపీ ప్రభుత్వం, ఉపముఖ్యమంత్రిగా ఉన్న పీడిక రాజన్నదొర ఏం చేశారని మంత్రి సంధ్యారాణి ప్రశ్నించారు. మక్కువ రోడ్డు కూడా నిర్మించలేక పోయారన్నారు. ఆయన సొంత గ్రామం కె.పెద్దవలసలో పాఠశాలకు భవనం కూడా లేదని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జైకా నిధులు మంజూరు చేయిస్తే.. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. సైకో జగన్ పరిపాలనలో జలాశయాలు అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి.. జైకా నిధులు రప్పించి వీఆర్ఎస్ పనులు పూర్తి చేయి స్తామన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బేబీనాయన, బోనెల విజయచంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్, ఎస్ఈ రాజరాజేశ్వరి, ఈఈ అప్పలనాయుడు, డీఈ సురేష్, ఎంపీడీవో పి.దేవ కుమార్, కూటమి శ్రేణులు, ఏఈఈలు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు పోస్టింగ్

- మండలాలను కేటాయించిన కలెక్టర్

పార్వతీపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లకు తిరిగి జిల్లాలో పోస్టింగ్‌లు ఇచ్చారు. వారికి మండలాలను కేటాయిస్తూ.. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎంపాడితిని కలెక్టర్ ఆఫీస్ ఏవోగా, భామిని, సీతంపేట తహసీల్దార్లుగా వి.సోమేశ్వరరావు, కె.అప్పారావును నియమించారు. పాలకొండ ఆర్డీవో ఆఫీస్ ఏవోగా ఎస్.నరసింహమూర్తిని, కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్‌గా జి.శ్రీరామ్మూర్తి, పాచిపెంట తహసీల్దార్‌గా డి.రవిని నియమించారు. కురుపాం తహసీల్దార్‌గా ఎం.రమణమ్మ, కేఆర్ఆర్‌సీ తహసీల్దార్‌గా ఎస్.భాస్కరరావు, స్పెషల్ తహసీల్దార్‌గా వి.రామస్వామి, కలెక్టరేట్ డీసీహెచ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఎన్.శివన్నారాయణ, సాలూరు తహసీల్దార్‌గా ఎన్వీ రమణకు పోస్టింగ్ ఇచ్చారు. సీతానగరం, పాలకొండ, గరుగుబిల్లి, కొమరాడ, బలిజిపేట, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం, జియ్యమ్మవలస తహసీల్దార్లుగా పి.అప్పలరాజు, ఆర్.బాలమురళీకృష్ణ, ఎన్.భుజంగరావును, జె.రాములమ్మ, కె.ఉమామహేశ్వరరావు, ఆర్.రమేష్‌కుమార్, జీవీ జనార్దన్, వి.సీతారామయ్యను నియమించారు. వారికి కేటాయించిన మండలాల్లో జాయిన్ అవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా మక్కువ, వీరఘట్టం మండలాలకు అక్కడి డీటీలు ఇన్‌చార్జి తహసీల్దార్లుగా వ్యవహరించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

నా దగ్గర ఆధారాలు ఉన్నాయి..
లీగల్‌గానే వెళతా



హీరో రాజ్‌తరుణ్, లావణ్యల వివాదం బుధవారం కొత్త మలుపు తిరిగింది. రాజ్‌తరుణ్ హీరోగా నటించిన 'తిరగబడరా సామీ' చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ బుధవారం జరిగితే అక్కడికి లావణ్య వచ్చారు. ఆ చిత్ర కథనాయిక, ఈ వివాదానికి కేంద్ర బిందువు అయిన మాల్వీ మల్హోత్రా కూడా వచ్చారు. రాజ్‌తరుణ్, మాల్వీ ఇద్దరూ వైట్ డ్రస్‌లో ఉండడం గమనార్హం. రాజ్‌తరుణ్ వస్తున్నాడని తెలియగానే మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. 'నా సినిమా హిట్ అయినప్పుడు కూడా ఇంత మంది మీడియా సభ్యులు రాలేదు' అంటూ రాజ్‌తరుణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తనపై వచ్చిన వివాదం గురించి ఆ మీడియా సమావేశంలో రాజ్‌తరుణ్ చెప్పిన మాటలు ఇవి.

- నాలో ఉన్న అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. నేను ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడడం లేదు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. అందుకే లీగల్‌గా వెళతున్నాను.
- నా వల్ల గర్భం వచ్చిందనీ, అబార్షన్ చేయించానని ఆరోపిస్తున్నారు. మరి ఆ విషయాన్ని పోలీసులకు ఇచ్చిన కంప్లయింట్‌లో ఎందుకు చేర్చలేదు? ఎందుకంటే అవి నిజాలు కావు కనుక. అందుకే ఈ విషయం గురించి నేను మాట్లాడను. మా లాయర్ ద్వారా ప్రొసీడ్ అవుతున్నా.
- నాకు ఇప్పుడు 32 ఏళ్లు. ఇన్నేళ్ల జీవితంలో ఎందరో పరిచయం అయి ఉంటారు. ఎంతో మందితో సాన్నిహిత్యం ఉంది. వాళ్లలో ఎవరైనా నేను మంచి వాడిని కాదు అని చెబితే పరిశ్రమ నుంచి తప్పుకొంటా.
- నేనూ మనిషినే. బాధలు ఉండవా! ఆ బాధ వల్లే 'పురుషోత్తముడు' చిత్రం ఫంక్షన్‌కు కూడా రాలేదు. ఆ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు.
- నాకు పెళ్లి మీద ఆసక్తి లేదు. అది ఇప్పుడు చెబుతున్న మాట కాదు. నా పాత ఇంటర్వ్యూలు చూస్తే అది మీకు తెలుస్తుంది.
- 'తిరగబడరా సామి' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఫ్యామిలీ అంతా చూడదగ్గ సినిమా ఇదనీ, మాల్వీ మల్హోత్రా మంచి నటి అనీ, ఆమెకు ఇదే తొలి సినిమా కనుక ఆదరించండి.

లావణ్య ప్రత్యక్షం



తనకు కనిపించకుండా తిరుగుతున్న రాజ్‌తరుణ్ ప్రసాద్ ల్యాబ్‌లో ఉన్నారని తెలియగానే లావణ్య అక్కడ ప్రత్యక్షమయ్యారు. రాజ్‌తరుణ్ కలుసుకోవాలని ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కొంతమంది మీడియా ప్రతినిధులు ఆమెతో మాట్లాడాలని ప్రయత్నించినా అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు లావణ్యను అక్కడ నుంచి పంపించేశారు. ఆ తర్వాత ఆమె మాదాపూర్‌లోని రాజ్‌తరుణ్ ఇంటికి చేరుకొని అక్కడ కూడా ఆందోళనకు దిగారు. తలుపు తీసే వరకూ అక్కడ నుంచి వెళ్లనని అన్నారు. రాజ్‌తరుణ్ అడిగిన ఆధారాలు తెచ్చినట్లు చెప్పారు.

కట్టి పడేసే కియారా



రామ్‌చరణ్ హీరోగా తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కియారా అద్వాణి కథానాయిక. బుధవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా లుక్ పోస్టర్ విడుదల చేశారు. చూపు తిప్పుకోవడం కష్టం అనేంతగా ఉన్న కియారా గ్లామర్ లుక్ అభిమానుల్ని కట్టి పడేస్తోంది.

'గద్దర్ అవార్డ్స్'పై కమిటీ ఏర్పాటు

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫిల్మ్ అవార్డ్స్ ను ఇకపై 'గద్దర్' అవార్డ్స్ పేరుతో ఇవ్వడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడంపై తెలుగు చిత్ర పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'నటుడిగా, గాయకుడిగా ఎంతో ప్రతిభ కలిగిన వ్యక్తి గద్దర్. ఆయన పేరు మీద అవార్డులు ఇవ్వాలనుకోవడం సముచిత నిర్ణయం. ఈ అవార్డుల విధివిధానాలు ఎలా ఉండాలో తయారు చేయడానికి తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు నిర్మాతల మండలి ఓ కమిటీని నియమిస్తాయి. ఆ విధి విధానాలను ఎఫ్.డి.సి. ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారికి త్వరలో అందజేస్తాం' అని తెలుగు చిత్ర పరిశ్రమ ఒక ప్రకటనలో తెలిపింది.

ఫ్యామిలీ డ్రామా



కృష్ణవంశీ, మోక్ష జంటగా నటించిన 'అలనాటి రామచంద్రుడు' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. చిలుకూరి ఆకాశ్‌రెడ్డి దర్శకుడు. హైమవతి, శ్రీరామ్ జడపోలు నిర్మాతలు. ఈ సినిమా నచ్చడంతో దిల్ రాజు విడుదల చేస్తున్నారు. ఫీల్‌గుడ్ ఫ్యామిలీ డ్రామా ఇదనీ, కథ అనుకున్నప్పుడే కొత్త వాళ్లతో తీయాలని అనుకున్నామనీ దర్శకుడు చెప్పారు. ఈ జనరేషన్‌కు కావాల్సిన స్వచ్ఛమైన ప్రేమను చిత్రంలో చూపించామనీ, కొత్త టాలెంట్‌తో సినిమా తీశామని నిర్మాతలు చెప్పారు.

బడ్డీనే హీరో



అల్లు శిరీష్ హీరోగా నటించిన 'బడ్డీ' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. జ్ఞానవేల్ రాజా, అదన నిర్మాతలు. శామ్ ఆంటోన్ దర్శకుడు. బుధవారం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో అల్లు శిరీష్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను సెకండ్ హీరో. టెడ్డీ బేర్ ఫస్ట్ హీరో. టెడ్డీ చేసే యాక్షన్ సీన్లు అలరిస్తాయి' అని చెప్పారు. ఈ సినిమా విషయంలో నిర్మాత హ్యాపీగా ఉన్నారనీ, టీమ్ కూడా సంతోషంగా ఉందని దర్శకుడు చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో



నా గత చిత్రాలకు మల్లే 'శివం భజే' సినిమాలోనూ ఓ కొత్త థ్రిల్లింగ్ అంశాన్ని చూపించబోతున్నాం అని హీరో అశ్విన్ బాబు అన్నారు. ఆయన హీరోగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. నేడు విడుదలవుతున్న సందర్భంగా అశ్విన్‌బాబు మీడియాతో ముచ్చటించారు. 'ఇందులో కుటుంబ అనుబంధాలతో పాటు ఆధ్యాత్మిక అంశాలను స్పృశించాం. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అని బలంగా నమ్మే పాత్ర నాది. ఇందులో యాక్షన్ స్టైలిష్‌గా ఉంటుంది' అని ఆయన చెప్పారు.

కీర్తి కామెడీ



కీర్తిసురేశ్ లీడ్‌రోల్ పోషిస్తున్న మహిళా ప్రాధాన్య చిత్రం 'రఘుతాత'. సుమన్ కుమార్ దర్శకుడు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. గడుసైన యువతి పాత్రలో కీర్తి కామెడీ పండించిన తీరు ఆకట్టుకుంది. హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది.

తుపాన్ లాంటి యాక్షన్



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'తుపాన్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్ బోరా, లలిత, ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోని మాట్లాడుతూ "బిచ్చగాడు' తర్వాత నా మనసుకు దగ్గరైన కథ ఇది. ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి. తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం యూనిట్ చాలా కష్టపడింది. విజయ్ ఆంటోని ఇందులో సరికొత్తగా కనిపిస్తారు. వినోదం,యాక్షన్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

టీడీపీతోనే సంక్షేమం.. అభివృద్ధి

● అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కోండ్రు

రాజాం, జూలై 31: సంక్షేమం అభివృద్ధికి పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ అని నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం పురపాలక సంఘం పరిధిలోని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. పురపాలక సంఘం పరిధిలోని గాయిత్రీ కాలనీలో గాయిత్రీ దేవి అమ్మవారు ఆలయం సమీపంలో కల్వర్టు, చర్చి వీధిలో కల్వర్టు, తెలగవీధిలో మూడు కల్వర్టులు, డ్రయిన్, సీసీ రోడ్డుకు, వాసవీ థియేటర్ వెనక వీధిలో శ్రీరామనగర్ కాలనీలో సీసీ రోడ్డు, పొనుగుటివలసలో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెలరోజుల్లో మరికొన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా కుంటుపడ్డాయని విమర్శించారు. అనంతరం శ్రీనివాస రోడ్డులో గల జూనియర్ కళాశాలలో, సారధి రహదారిలో బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను, బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, కోటగిరి నారాయణరావు, గుడివాడ నాగరాజు, ముగడ శ్రీనివాసరావు, కోటి, భీంపల్లి తిరుపతిరావు, జరజాన నీలయ్య, కొంపిల్ల రవీంద్ర టంకాల నాగరాజు, కరణం మురళీ, వల్లూరి గణేష్, మరిపి జగన్మోహన్‌రావు, నల్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. ● **వంగర:** కార్పొరేట్ విద్యా సంస్థలు కంటే ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతున్నారని ఎమ్మెల్యే కోండ్రు అన్నారు. బుధవారం మద్దువలస జీజే కళాశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు, టీడీపీ నాయకులు వాసుదేవరావు, పైల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: టీడీపీ ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమలుతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తోందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు తెలిపారు. మండలంలో బూరాడ గ్రామంలో నిర్మించిన నూతన సచివాలయ, రైతుభరోసా భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కోండ్రు మాట్లాడారు. టీడీపీనేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, గురవాన నారాయణరావు, పాలవలస రామచంద్రినాయుడు, గురవాన ధనంజయ్‌రావు, కర్ణేన మహేష్ తదితరులు పాల్గొన్నారు.



రాజాంలో డ్రైన్లకు శంకుస్థాపన చేస్తున్న కోండ్రు

బాలుడిపై ప్రతాపం

● నిర్బంధించి ఇబ్బంది పెట్టిన ఓ ఫైనాన్స్ సంస్థ
● శృంగవరపుకోటలో ఘటన

శృంగవరపుకోట జూలై 31: శృంగవరపుకోట పట్టణంలో ఉన్న ఓ ఫైనాన్స్ సంస్థ యాజమాన్యం మైనర్ బాలుడిని బుధవారం సాయంత్రం నిర్బంధించింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపాడ మండలం అరిజిపాలెం గ్రామానికి చెందిన కాపు గంటి సన్యాసిరావు ఏడాది క్రితం ఆ ఫైనాన్స్ కంపెనీలో రూ.1.20 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ప్రతి నెలా వాయిదా చెల్లిస్తున్నారు. అయితే ఈ నెల వాయిదా చెల్లించడంలో ఆలస్యమైంది. బుధవారం సాయంత్రం ఫైనాన్స్ కంపెనీకి చెందిన ఐదు గురు వ్యక్తులు సన్యాసిరావు ఇంటికొచ్చారు. ఇంట్లో సన్యాసిరావు లేకపోవడంతో భార్య రాజేశ్వరిని దుర్భాషలాడారు. అక్కడ నుంచి ఇద్దరు వ్యక్తులు సన్యాసిరావు నడిపే కిరాణా దుకాణం వద్దకు వెళ్లారు. అక్కడ కుమారుడు కాపుగంటి కార్తికేయను 'మీ నాన్న ఎస్.కోటలో ఉన్నారు' అని నమ్మబలికి ద్విచక్రవాహనంపై వారి వెంట ఫైనాన్స్ కంపెనీ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈవిషయం తెలుసుకున్న మీడియా రాత్రి 9 గంటలకు అక్కడికి చేరుకుంది. ఫైనాన్స్ వాయిదాలు చెల్లించకపోతే ఇలాగే నిర్బంధిస్తామని మీడియాతో కూడా వారు మొండిగా మాట్లాడారు. మీడియా ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఫైనాన్స్ వ్యక్తుల చెరలో ఉన్న బాలుడిని పోలీసులు తండ్రికి అప్పగించారు. నిందితులపై ఇతరత్రా చర్యల కోసం వల్లపూడి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని పోలీసులు సలహా ఇచ్చారు.

నివేదిక అందజేయండి

రామభద్రపురం: మండల కేంద్రంలోని గత నెల 26న ఉపాధిహామీ పథకం సోషల్ ఆడిట్‌లో జరిగిన అక్రమాలపై గత నెల 27న ఆంధ్రజ్యోతి పత్రికలో 'హాజరు లేకపోయినా చెల్లింపులు' అనే శీర్షికన కథనం వెలువడింది. దీనిపై జిల్లా కలెక్టర్ నివేదికను అందజేయాలని ఉపాధి హామీ పథకం అధికారులను ఆదేశించినట్టు డీపీఆర్‌వో రమేష్ తెలిపారు. దీనిపై ఆ శాఖకు సంబంధించిన అధికారులు వివరాలను సిద్ధం చేసి పంపనున్నట్టు తెలిపారు.

పారితోషకాలు చెల్లించాలి

బొబ్బిలి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొన్న బీఎల్వోలకు పారితోషకాలు చెల్లించాలని కోరుతూ తహసీల్దార్ ఎం.శ్రీనుకు బొబ్బిలి మండలం అలజంగి గ్రామ సచివాలయ సిబ్బంది బుధవారం వినతి పత్రం అందించారు. అందుకు తహసీల్దార్ సానుకూలంగా స్పందించి ఉన్నత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బాలల ఆరోగ్య పోటీలు

విజయనగరం రూరల్: ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆగస్టు 2న ఆరోగ్య బాలల పోటీలు నిర్వహించను న్నట్టు ఆ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జి శిరీష, కల్పనా కుక్రే జా, చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు రోటరీ కమ్యూనిటీ హాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పోటీల్లో 1 సంవత్సరం నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ పేర్లను 70320 68242, 8328353270 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీలో అప్రంటీస్‌షిప్‌కు నోటిఫికేషన్

విజయనగరం రింగురోడ్డు: ఏపీఎస్‌ఆర్టీసీలో అప్రంటిస్‌షిప్ చేసుకునేందుకు ఐటీఐ పాసైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్టు ఆ సంస్థ ప్రజారవాణాధికారి అప్పలనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్, ఫిట్టర్, పెయింటర్, మిషనిస్ట్, డ్రాఫ్ మాస్ (సివిల్) తదితర ట్రేడులకు సంబంధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆగస్టు 23 నుంచి ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమౌతుందని, వీటీ అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలకు హాజరుకావాలని కోరారు.

పత్తిపంటలో అంతర్ పంట వేసుకోవాలి

బొబ్బిలి రూరల్: బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామంలో బుధవారం పత్తిపంట చీడపీడలకు గురి కాకుండా ఉండడానికి గ్రామ వ్యవసాయ సహాయకులు బి.రాజశేఖర్ రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఇందులో భాగంగా పత్తి పంటలో అంతర్ పంటగా పొద్దుతిరుగుడు, కంది విత్తనాలు వేసుకోవాలన్నారు. దీంతో రైతుకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. గ్రామ రైతులు పాల్గొన్నారు.

కాలిబాటలు తప్పనిసరిగా తీసుకోవాలి

బాడంగి: వరినాట్లు వేసిన తరువాత ప్రతి రైతూ తప్పనిసరిగా కాలిబాటలు తీసుకోవాలని వ్యవసాయ సహాయకులు వాడాడ సాయికుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని పినపెంకి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు.

నేడు తాగునీటి సరఫరా నిలుపుదల

బొబ్బిలి: పట్టణంలో తాగునీటి సరఫరాను మెరుగు పరిచేందుకు తీసుకునే చర్యల్లో భాగంగా గురువారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అన్న క్యాంటీన్ దగ్గర గల వాటర్‌ట్యాంకు, రాణిమల్లమ్మ దేవి పార్కుదగ్గర గల వాటర్ ట్యాంకులకు స్లూయిస్ వాల్వులను బిగించే ప్రక్రియ నిర్వహిస్తుండడంతో ఒక రోజు మంచినీటి సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు.

ప్రతి చిరుద్యోగి మార్పు కోరుకున్నారు

కొత్తవలస: రాష్ట్రంలో సుపరిపాలన ఏర్పడాలనే ధ్యేయంతో ప్రతి ఉద్యోగి ఎన్‌డీఏ కూటమి కోసం పని చేశారని శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం మండలంలోని వీరభద్రపురం గ్రామంలో ఒక ఉపాధ్యాయుడి పదవీవిరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ఏర్పాటు కోసం ఉపాధ్యాయులు ఎంతో కృషి చేశారని, ఇప్పుడు రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందన్నారు.

జిల్లా బ్రాహ్మణ సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్

శృంగవరపుకోట రూరల్: మండల శివారు తాటిపూడి ఉమాకోటిలింగేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు దొంతుకుర్తి సాయికుమార్ శర్మ జిల్లా బ్రాహ్మణ సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. బుధవారం సంబంధిత నియామక పత్రాన్ని సమాఖ్య ప్రతినిధులు అందించారు. సాయికుమార్‌శర్మ ఎంపికపై మండల బ్రాహ్మణ సమాఖ్య హర్షం వ్యక్తంచేసింది.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రాజాం: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం రాజాం పట్టణంలో పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆర్‌వీజే నాయుడు, నంది సూర్యప్రకాస్‌రావు, కోటగిరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

రాజాం రూరల్: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు రాజాం మున్సిపాలిటీ పరిధిలోని జీఎంఆర్ ఐటీ ప్రాంతంలో రాజాం రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. సంతకవిటి ఎస్.ఐ. షేక్ శంకర్, సిబ్బందితో కలిసి బుధవారం వేకువఝాము నాలుగు గంటల నుంచి ఉదయం ఏడు గంటల వరకూ వాహనాల తనిఖీ కొనసాగించారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా జరుగుతున్న నేపథ్యంలో తనిఖీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. గంజాయిని కలిగిఉన్నా, అమ్మినా, వినియోగించినా కఠినచర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

సహకార డిపాజిట్‌లను పెంచాలి

● డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ కార్తీక్

విజయనగరం రూరల్, జూలై 31: జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో డిపాజిట్లు, పెట్టుబడులు పెంచేందుకు కృషి చేయాలని ఆ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. బుధవారం బ్యాంకు చాంబర్లో జరిగిన బ్యాంకు మహాజన సభలో ఆయన మాట్లాడారు. డీసీసీబీ వ్యాపారం మునుపటి ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే, గత ఆర్థిక సంవత్సరంలో 14.3 శాతం వృద్ధి సాధించడం హర్షణీయమన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 18,38,65.32 లక్షలు కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 21,01,53.21 లక్షల వ్యాపారం జరిగిందని, అదే సమయంలో బ్యాంకు సొంత నిధులు 14.14 శాతం వృద్ధిచెందాయన్నారు. బ్యాంకు డిపాజిట్లు 27,654.41 లక్షల నుంచి 9.27 శాతం వృద్ధితో 30,218.44 లక్షలకు పెరిగాయన్నారు. నాబార్డు డీడీఎం నాగార్జున మాట్లాడుతూ, డీసీసీబీ బ్యాంకు పరపతిని పెంచాలన్నారు. ముఖ్యంగా డిపాజిట్లను ఇంకా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పీఏసీఎస్‌ల మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, ఆదాయం పెంచుకుని బలోపేతం కావాలన్నారు. సహకార అధికారి రమేష్ మాట్లాడుతూ, జిల్లాలో 65 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా, వీటిలో కేవలం 10 మాత్రమే లాభాల్లో ఉన్నాయన్నారు. మిగిలిన వాటిని కూడా లాభాల బాట పట్టించడా నికి తగిన కృషి అవసరం ఉందన్నారు. ఈ మహాజన సభలో పార్వతీపురం-మన్యం జిల్లా సహకార అధికారి శ్రీరామమూర్తి, డీసీఏవో శ్రీరామమూర్తి, పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జులు, డీసీసీబీ అధికారులు పాల్గొన్నారు. డీసీసీబీ ఇన్‌చార్జి సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు వార్షిక నివేదికను వివరించారు.



మాట్లాడుతున్న డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కార్తీక్

బస్సు సర్వీసులు ప్రారంభించిన కోళ్ల

శృంగవరపుకోట, జూలై 31: ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికులకు మరింత సేవలు అందించేందుకు నూతనంగా ఏర్పాటుచేసిన బస్సు సర్వీసులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం ప్రారంభించారు. డిపో మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో అల్ట్రాడీలక్స్, పల్లెవెలుగు నూతన బస్సు సర్వీసులను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాజు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మండలపార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు ఉన్నారు.



ఆర్టీసీ సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

మా భూములు మాకు ఇప్పించండి

శృంగవరపుకోట: జిందాల్ పరిశ్రమ వస్తుందని చూసి మోసపోయామని, తమను మరింత మోసంచేసే కుట్ర కొనసాగుతుందని, తమను ఈకుట్రనుంచి కాపాడి తమ భూములు తిరిగి ఇప్పించాలని మండలంలోని జిందాల్ నిర్వాసితులు టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని వేడుకున్నారు. బుధవారం ఎస్.కోటలో ఎమ్మెల్యే లలితకుమారిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 2008లో తమ బతుకులు బాగుపడతాయని ఈ కంపెనీకి భూములు ఇచ్చామని, తరువాత పరిశ్రమ రాక భూస్వాములుగా ఉన్న తాము దినసరి కూలీలుగా మారిపోయామన్నారు. తమ భూములు తమకు వెనక్కి ఇప్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మీకు న్యాయం చేస్తామని హామి ఇచ్చారు.

ఆరుబయట చెత్త వేస్తే చర్యలు

బొబ్బిలి: రోడ్లపై, వీధుల్లో, కాలువల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తా చెదారాలను పారబోస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి హెచ్చరించారు. వార్డు పర్యటనలో భాగంగా బుధవారం ఆమె స్థానిక రామాటాకీస్ జంక్షన్, ఆరిగంగయ్య షాపింగ్ కాంప్లెక్స్, ఎన్టీఆర్ జంక్షన్, వేణుగోపాలస్వామి కోవెల సెంటరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

శాకంబరిగా నవదుర్గ



రాజాం/రూరల్: నవదుర్గ వేదమాత, జ్ఞానసరస్వతి అమ్మవా ర్లు బుధవారం శాకంబరిగా భక్త లకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం, ఏకాదశి పర్వదినం సందర్భంగా సుమారు 500 కిలోల కూర గాయలు, ఆకుకూరలతో అమ్మ వార్లను అలంకరించారు. మూడురో జుల పాటు భక్తులకు ఇదే అలంక రణలో అమ్మవారు దర్శనమిస్తారని ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ, రామచంద్ర శర్మ తెలిపారు. అమ్మవార్లను అలంకరించిన కూరగాయలు, ఆకుకూ రలను శుక్రవారం నిర్వహించ నున్న అన్నప్రసాద వితరణలో వినియోగిస్తామని గురు భవాని కూరాడ వెంకటరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో బుధవారం యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయగౌరి ఆధ్వర్యంలో మండల ఉపాధ్యాయులు పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మండల విద్యాశాఖాధికారికి, ఎంపీడీవోకి వినతిపత్రం ఇచ్చారు. జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, ప్రధాన కార్యద ర్శులు మహేష్, శ్రీనివాస్, స్వామినాయుడు, రాధాకృష్ణ, అనంతరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంపీడీవోకి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నేడు తెరచుకోనున్న జేఎస్‌ఎల్ కర్మాగారం

● నేటి నుంచి విధులకు ఎంప్లాయిస్ కార్మికులు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాలనగర్‌లో ఉన్న జేఎస్ఎల్ కర్మాగారం గురువారం నుంచి తెరచుకోనుంది. సుమారు మూడు నెలలు లాకౌట్ అనంతరం మళ్లీ కర్మాగారాన్ని గురువారం తెరవడానికి యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. గురువారం నుంచి కర్మాగారానికి చెందిన 47 మంది ఎంప్లాయిస్, 10 మంది కార్యాలయ సిబ్బంది విధులకు హాజరుకానున్నారు. కర్మాగారంలో లాకౌట్ వేసేనాటికి 57 మంది ఎంప్లాయిస్ కార్మికులు ఉండగా జూన్ నెలలో 10 మంది ఎంప్లాయిస్ కార్మికులు పదవీ విరమణ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు మాత్రం ఇంకా పని కల్పించడం లేదు. వారి అవసరాన్ని బట్టి కార్మికులను పనిలోకి తీసుకుంటారు. ప్రస్తుతం ఉన్న కర్మాగారంలో మార్పులు చేసి సిలికాన్ ఉత్పత్తి పరిశ్రమగా మార్పు చేయనున్నట్టు యాజమాన్యం తెలిపింది.

పీడీఎస్ బియ్యం వేలంపాట వాయిదా

రేగిడి: స్థానిక సివిల్‌సప్లయ్ గొడౌన్‌లో బుధవారం నిర్వహించాల్సిన పీడీఎస్ బియ్యం వేలం పాట వాయిదాపడినట్లు డీటీ సత్యనారాయణ తెలిపారు. జిల్లా సివిల్‌సప్లయ్ అధికారుల ఆదేశాలతో రేగిడి, వంగర మండలాల్లో 6ఏ కేసుల్లో పట్టుబడిన 15 క్వింటాళ్ల బియ్యం వేలం వేయాల్సి ఉంది. ఇందుకు కొంతమంది ధరావత్తు చెల్లించేందుకు ముందుకు వచ్చారు. అయితే అనివార్య కారణాల వల్ల జిల్లా సివిల్ సప్లయ్ అధికార్లు ఆదేశాల మేరకు వేలం వాయిదా పడినట్లు, కొత్త తేదీ త్వరలో ఖరారు చేస్తారని డీటీ స్థానిక విలేఖర్లకు తెలిపారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు

బొబ్బిలి: ఆగస్టు 2, 3, 4 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరగనున్న రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు బయలుదేరి వెళుతున్నారు. వీరంతా బుధవారం స్థానిక ఎమ్మెల్యే అయిన తైక్వాండో క్లబ్ అధ్యక్షుడు బేబీనా యనను కలుసుకున్నారు. క్రీడాకా రులందరినీ బేబీనాయన అభినంది స్తూ పతకాలను సాధించి రావాలని కోరుకున్నారు. సబ్ జూనియర్ విభాగంలో జోష్నప్రియ, వరలక్ష్మి, రోషన్, హాసిని, కేడెట్ విభాగంలో షర్మిల, జాజిలి, ఆదిత్య నిహాల్, ప్రవీణ్‌కుమార్, శివరామకృష్ణ పాల్గొంటున్నట్లు తైక్వాండో కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు.



క్రీడాకారులతో బేబీనాయన

మెడ్‌పేస్‌కి సెంచూరియన్ విద్యార్థి ఎంపిక

పర్లాకిమిడి, జూలై 31: పర్లాకిమిడి సెంచూరియన్ విద్యాసంస్థల్లో బీటెక్ పైటో ఫార్మాసీటికల్ పూర్తి చేసిన ఆనాం నవాజ్ యునైటెడ్ కింగ్‌డంకి చెందిన మెడ్ పేస్ సంస్థలో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా ఎంపికయ్యారని సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ డీఎన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. 54లక్షల వార్షిక వేతనంతో ఆ సంస్థ ఎంపిక చేసిందని, ఇంత మొత్తంలో వేతనం పొందిన మొదటి విద్యార్థిగా నవాజ్ గుర్తింపు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా నవాజ్‌కు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అనితా పాత్రో, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



నవాజ్

అంకిత భావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు

విజయనగరం క్రైం, జూలై 31: జిల్లా పోలీసు శాఖలో అధికారులు, సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. సుదీర్ఘకాలం పోలీసుశాఖలో బాధ్యతాయుతంగా, ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన దిశా పోలీసు స్టేషన్ డీఎస్పీ టీకు మోహనరావు, బొబ్బిలి సర్కిల్ ఇన్‌స్పెక్టరు సేపాన తిరుమలరావు, రూరల్ పోలీసు స్టేషన్ హెచ్‌సీ పొండ్రంకి వాసుదేవరావులకు జిల్లా పోలీసుశాఖ తరపున ఎస్పీ వకుల్ జిందాల్ ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పనిచేసిన అధికారులు, సిబ్బంది సమర్థంగా పనిచేయడం వల్ల నేడు జిల్లాలో మావోయిస్టుల ప్రభావం అదుపులోకి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ పూలమాల, పండ్లు, జ్ఞాపికలతో సత్కరించారు. ఏఎస్పీ అష్మాపరహీన్, ఎంఎం సోల్మాన్, డీఎస్పీ యానివర్స్, సీఐలు నర్సింహమూర్తి, నాగేశ్వరరావు, రాజశేఖర్, ఆర్ఐలు గోపాలనాయుడు, భగవాన్, రమేష్‌కుమార్, పోలీసు అసోసియేషన్ ప్రతినిధి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పదవి విరమణ పొందిన అధికారులు సిబ్బందితో ఎస్పీ వకుల్

ప్రజాసమస్యలపై అధికారులు స్పందించరా?

● బొబ్బిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించిన సభ్యులు

బొబ్బిలి, జూలై 31: బొబ్బిలి పట్టణంలో వీధి వ్యాపారుల దగ్గర ప్రతి రోజూ వేలాది మంది ఫాస్ట్‌ఫుడ్ పేరుతో అనేక తినుబండారాలను తింటున్నారని, వాటిలో నాణ్యతా ప్రమాణాలు ప్రశ్నార్థకంగా ఉన్నాయని మున్సిపల్ వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ అన్నారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు చాలా సంయమనంగా వ్యవహరించి రాజకీయాల జోలికి పోకుండా పూర్తిగా ప్రజా సమస్యలపై చర్చించారు. చెలికాని మాట్లాడుతూ ఆహార పదార్థాల నాణ్యత తనిఖీల నిర్వహణలో అధికారులు ఎందుకు బాధ్యతగా వ్యవహరించడం లేదని నిలదీశారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడతామని కమిషనరు లాలం రామలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టరు శివ తెలిపారు. పట్టణంలో కుక్కలబెడద ఆందోళనకరంగా ఉందని, కుక్కల జనాభా నియంత్రణకోసం చేసిన ఖర్చుల వివరాలను బయటపెట్టాలని చెలికాని డిమాండ్ చేశారు. రాంబార్కి శరత్‌బాబు మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో యంత్రాంగం విఫలమవుతోందని ఆరోపించారు. దీనిపై ఏఈ సురేష్ బదులిస్తూ సాంకేతిక కారణాల దృష్ట్యా లీకేజీలను అరికట్టలేకపోతున్నామని, త్వరలో ఈ సమస్య పరిష్కారమవుతుందన్నారు. టీడీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడరు గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డులో పనులు జరుగుతున్నప్పుడు తమకు కనీస గౌరవమర్యాదలు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలగాడ హైమావతి మాట్లాడుతూ వార్డులో తాగునీటి సమస్యలు వచ్చినప్పుడు సిబ్బంది స్పందించడం లేదన్నారు. మూడో వార్డు కౌన్సిలర్ బొత్స సురేష్ మాట్లాడుతూ ఎస్సీ వార్డు అయినప్పటికీ తన వార్డులో జనరల్ ఫండ్ నిధులను ఎందుకు ఖర్చు చేయడం లేదని నిలదీశారు. జిల్లాలోని నాలుగైదు మున్సిపాలిటీలకు ఒకే డీఈఈని నియమిస్తే అభివృద్ధి పనులు ఎలా జరుగుతాయని వైస్‌చైర్మన్ చెలికాని అన్నారు. నెలిమర్ల, రాజాం, విజయనగరం, బొబ్బిలి మున్సిపాలిటీలకు ఒక్కరే డీఈఈని నియమించడం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వానికి లేఖ రాసినట్లు కమిషనరు తెలిపారు. ఇందిరమ్మకాలనీలలో దురాక్రమణలు, కబ్జాలు ఇతర అక్రమాలపై చర్యలు తీసుకోవాలని చాలాసార్లు చెప్పామని అయినా పరిస్థితి మారలేదని గెంబలి విమర్శించారు. రోడ్ల పనులకు ప్రతిపాదనలు పంపామని కమిషనర్ తెలపగా అవి జరిగే పనులు కాదని, తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని చెలికాని కోరారు. మేనేజరు శివప్రసాద్, ఆర్వో ప్రసాదరావు, ఆర్ఐ సురేష్‌బాబు, టీపీఎస్ వరప్రసాద్, మెప్మా అధికారి జగన్మోహన్, డీఈఈ, ఏఈలు సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసమస్యలపై అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

వ్యక్తి ఆత్మహత్య

చీపురుపల్లి, జూలై 31: చీపురుపల్లి పట్టణంలోని కొత్త గవిడివీధిలో చింత రవి కుమార్(42) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం ప్రకారం.. మృతుడు స్థానిక రింగ్ రోడ్డులో కొంత మందితో కలిసి హోటల్ నడుపుతున్నాడు. బుధవారం ఉదయాన్నే ఆరోగ్యం బాగా లేదని ఇంటి యజమానికి చెప్పాడు. రవికుమార్ హోటల్‌కి కూడా రాకపోడంతో, హోటల్ సిబ్బంది ఫోన్ చేశారు. ఎప్పటికీ ఫోల్ లిఫ్ట్ చేయకపోవడంతో, ఇంటికి వచ్చి ఆరా తీశారు. తలుపులు గడియ పెట్టి ఉండడంతో అనుమానం వచ్చి తలుపులు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. అప్పటికే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే మృతుడు ఎక్కడినుంచి వచ్చాడో, ఏ ప్రాంతానికి చెందిన వాడో తమకు తెలియదని హోటల్ సిబ్బంది, స్థానికులు చెబుతున్నారు. కాగా, ఘటన జరిగిన గదిలో ఒక నోట్ దొరికిందని, దాంట్లో చాలా మందికి డబ్బులివ్వాలని మాత్రమే మృతుడు పేర్కొన్నట్టు ఎస్సై కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

సీతానగరం, జూలై 31: మండలంలోని ఆర్.వెంకంపేట గ్రామ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో పట్నాన పోలిశెట్టి(60) మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఆర్.వెంకంపేట గ్రామానికి చెందిన పోలిశెట్టి విశాఖపట్నంలో కుల వృత్తి చేసుకుని స్వగ్రామానికి వెళ్లడానికి చినబోగిలి నుంచి ఆర్.వెంకంపేట సమీపంలో పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందినట్లు తెలిపారు. రైల్వే పోలీసులు ఆర్.రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జామి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి హెచ్‌సీ మహేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్కవరపుకోట మండలం భీమాలికి చెందిన నెల్లి గౌరునాయుడు(34) భీమాలి నుంచి గోల్లాం గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా జామి రింగ్‌రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పడంతో రైలింగ్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఇతన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడన్నారు. మృతుడి భార్య మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పారాధిలో చోరీ

బొబ్బిలి రూరల్, జూలై 31: బొబ్బిలి మండలం పారాధి గ్రామంలోని ఓ ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంట నాగమణి గత 10 రోజుల నుంచి తన చెల్లెలి కూతురి పెళ్లి కోసం బొబ్బిలి వెళ్లి బుధవారం ఇంటికి చేరుకుంది. ఇంటి తలుపులు తీసి చూడగా వెనక వైపు నుంచి దొంగలు ఇంట్లో దూరి బీరువా తాళం బద్దలు కొట్టి 20 తులాల బంగారం, 20 వేల నగదు దోచుకెళ్లినట్టు గుర్తించింది. దీనిపై బొబ్బిలి స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని నాగమణి తెలిపింది. దీంతో విజయనగరం నుండి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య, కుమారుడు కనిపించడంలేదని ఫిర్యాదు

రాజాం రూరల్: తన భార్య లక్ష్మి, కుమారుడు విజయకుమార్ జులై 7 నుంచి కనిపించడం లేదని మండల పరిధిలోని పెనుబాక గ్రామానికి చెందిన గుడివాడ పాదాలు రాజాం పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. వారిద్దరి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేదని ఆ ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఏఎస్ఐ. భాస్కర్రావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో పొగలు

రాజాం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని డోలపేటకు చెందిన చెవ్వూరి మోహనరావు ఇంట్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా పొగలు చిమ్మడంతో ఆందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందోనన్న భయంతో ఇంట్లో ఉన్న వారంతా రోడ్డుపైకి పరుగులు తీశారు. సకాలంలో చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ప్రమాదం పెరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే చిన్నపాటి మంటలు చెలరేగాయని గుర్తించారు.

రేషన్ సరఫరా చేసిన వాహనాలపై ఆరా

కలెక్టరేట్: నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మొబైల్ డిస్పెన్సరీ యూనిట్లు (ఎండీయూ), బియ్యం నాణ్యతపై సివిల్ సప్లయ్ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. మండల పౌర సరఫరాల అధికారుల ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. గత రెండు రోజులు నుంచి ఈ సర్వే ప్రక్రియ మొదలైంది. ఇప్పటికే పౌర సరఫరాల అధికారులు గ్రామాలు, పట్టణాలు ప్రజలు నుంచి వివరాలు సేకరిస్తున్నారు. బియ్యం ఎలా ఉన్నాయి? నాణ్యత ఎలా ఉంది? అనేదానిపై పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి మధుసూదనరావు కూడా పాఠశాలలో విద్యార్థులు భోజనం చేసే సమయంలో వెళ్లి వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ జరుగుతుంది. ఆగస్టు నెలకు సంబంధించి నిత్యవసర సరుకులు వాహనాల ద్వారా పంపిణీ జరగనుంది. ఈ సమయంలో వాహనాల ద్వారా ప్రతి కార్డుదారుడికీ, ఇంటింటికీ సరుకులు అందుతున్నాయా? లేదా అనేదానిపై సర్వే నిర్వహించనున్నారు. ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుని రాష్ట్ర సివిల్ కమిషనర్‌కు నివేదిక సమర్పించనున్నారు. అనంతరం ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నది. ఒకటి, రెండు తేదీల్లో సర్వే పూర్తి చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 370 ఎండియూలు ఉన్నాయి. గురువారం నుంచి సరఫరా చేయనున్న బియ్యంతో పాటు రాగులు కూడా కార్డుదారులకు అందజేయనున్నారు.

ఉపాధి పనుల్లో జాప్యం తగదు

రాజాం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం చేపడుతున్న ఉపాధి పనుల్లో జాప్యం చేయవద్దని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం ఉపాధి హామీపథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు చేపట్టడంలో, బిల్లులు చెల్లించడంలో జాప్యం చేయవద్దన్నారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పుడు మస్తర్లు వేస్తున్నారని, పనులు పరిశీలించినపుడు ఎటువంటి తేడాలు కనిపించినా చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు

కొత్తవలస: జిల్లాలో ఉన్న 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన 5000 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, నోట్ పుస్తకాలను పంపిణీ చేశామని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్. భీమశంకరరావు అన్నారు. బుధవారం కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, నోట్ పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విద్యార్థులే పాఠ్యపుస్తకాలను, నోట్ పుస్తకాలను కొనుగోలు చేసుకునేవారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థులు ఎక్కువ మంది పేద విద్యార్థులేనని ప్రభుత్వం భావించి ఉచితంగా పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో 18 కళాశాలలకు చెందిన సుమారు 5 వేల మంది లబ్ధి పొందారన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుని కార్పొరేట్ కళాశాలలకు దీటుగా మంచి మార్కులను సాధించుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో మంచి అర్హత కలిగిన అధ్యాపకులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డీవీఎం కృష్ణా రెడ్డి, గ్రంథాలయ అధ్యాపకురాలు పద్మావతి, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీరాములను, అధ్యాపకులు ప్రసన్న కుమార్, జ్యోతి రాణి పాల్గొన్నారు.

తిమ్మయ్యపేటలో శానిటేషన్ పనులు

రాజాం రూరల్: మున్సిపాలిటి పరిధిలోని ఎనిమిదోవార్డు తిమ్మయ్యపేటలో మున్సిపల్ సిబ్బంది బుధవారం శానిటేషన్ పనులు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, సిబ్బంది రంగంలోకి దిగారు. రోడ్లు, కాల్వలను పరిశీలించారు. బ్లీచింగ్, స్ప్రేయింగ్ చేయించారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

పార్వతీపురం,ఆంధ్రజ్యోతి: జిల్లాలోగురువారం నుంచి ప్రపంచతల్లిపాలు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు.

సవర ఆదివాసీ పెయింటింగ్‌పై వర్క్‌షాప్



మాట్లాడుతున్న కార్తీక్

సీతంపేట: సీతంపేటలో న్యూహోప్ ఫౌండేషన్స్ సహకారంతో సవర ఆదివాసీ పెయింటింగ్ వర్క్‌షాప్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లేపాక్షి కార్యనిర్వహణాధికారి ఆసపు కార్తీక్ మాట్లాడుతూ లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్స్ (ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో ఆదివాసీలకు హస్త కళలు పెయింటింగ్ శిక్షణఇస్తున్నట్లు తెలిపారు. 20 మంది ఆదివాసీలకు ఆర్టిజన్స్ రెండు నెల లు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లేపాక్షి ప్రిన్సిపాల్ సెక్రటరీ సునీత, ఎండీ ఎం.బాలసు బ్రహ్మణ్యంరెడ్డి, డిజైనర్స్ ధర్మ తేజస్వి, ఆశిష్, శ్రీవాత్సవ్, కిషోర్, కన్వీనర్ అనీల్‌కుమార్, ఆర్ట్ టీచర్ గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

భాసూరు కాలువలో పూడికతీత

పాలకొండ: మండలంలోని భాసూరులో పిల్ల కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. కాలువక పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండి నీటి ప్రవహం నిలిచిపోతోంది. ఈ విషయాన్ని వైసీపీ ప్రభుత్వానికి ఎన్నిమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో రైతులు తమ సొంత నిధులతో కాలువల్లో పూడికతీత పనులను బుధవారం తీయించారు. సర్పంచ్, రైతులు కలిసి రూ.42 వేలు సేకరించి పనులు చేయించారు. సర్పంచ్ గురునాయుడు, జనసేన నాయకులు వారాడ శ్రీను, రైతులు వారాడ సింహాచలం, గేదెల దుర్గారావు పర్యవేక్షణలో పూడికతీత పనులు చేపట్టారు.

గ్రంథాలయ బకాయిలు చెల్లించాలి


ఈవోపీఆర్డీ గోపాలరావుకు వినతిపత్రం అందిస్తున్న మధుసూదనరావు

గరుగుబిల్లి: మండలంలోని పంచాయతీల నుంచి గ్రంథాలయానికి అందాల్సిన సెస్ బకాయిలను విడుదలచేయాలని నిర్వాహకులు నల్ల మధుసూదనరావు కోరారు. ఈ మేరకు బుధవారం మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావుకు కలిసి విన్నవించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు బకాయి వివరాలు అందజేస్తున్నామని తెలిపారు. గ్రంథాలయాలకు ఎనిమిది శాతం మేర చెల్లించాల్సిఉందని మధుసూదనరావు తెలిపారు. 25 పంచాయతీల పరిధిలో బకాయిలు చెల్లించేలా కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తున్నామని ఈవోపీఆర్డీ గోపాలరావు తెలిపారు. పంచాయతీలవారీగా బకాయిలను జిల్లా గ్రంథాలయ సంస్థకు జమచేస్తామని చెప్పారు.

సీఆర్టీలకు సామర్థ్య పరీక్షలు


వైటీసీలో సామర్థ్య పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఒప్పంద ఉపాధ్యాయులు (సీఆర్టీ) పనితీరు, బోధనసామర్థ్యం మెరుగుకు చర్యలు తెలుసుకోవడానికి వీలుగా పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం వైటీసీలో సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. 210 మంది సీఆర్టీలు విధులు నిర్వహిస్తుండగా వీరిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న వందమంది, ఆశ్రమ హైస్కూల్‌లో పనిచేస్తున్న 110 మంది స్కూల్ అసిస్టెంట్లు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్ష ద్వారా సీఆర్టీల బోధనాసామర్థ్యం తెలుస్తుందన్నారు.తక్కువమార్కులు వచ్చిన వారికి మెరుగైన శిక్షణ ఇప్పించి సామర్థ్యం మెరుగుకు చర్యలు తీసుకుం టామని చెప్పారు. కార్య క్రమంలో పార్వతీపురం మన్యం డీడీ రుక్మాందరావు, సీతంపేట గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈవో పి.నారాయుడు, పాతపట్నం, మెళియాపుట్టి, సీతంపేట సహాయ గిరిజన సంక్షేమశాఖాధి కారులు మంగవేణి, శ్రీనివాసరావు, ఏఎంవో కోటిబాబు, సీఎంవో చిరంజీవులు, జిసిడిఎం రాములమ్మ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణకు వినతి


పాలకొండల ఎమ్మెల్యే జయకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

పాలకొండ: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు దావాల రమణారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కనీస వేతనాలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు మార్చాలని, సంబంధం లేని పనులు చేయించవద్దని ఆశ వర్కర్లు కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశ్వరి, ఆశ వర్కర్లు వెంకటమ్మ, భానుప్రియ, జి.కృష్ణవేణి, పి.లక్ష్మి, పి.చిట్టెమ్మ, కె.శాంతి, పి.రాధారాణి, సీహెచ్ భాగ్యలక్ష్మి, కె.పార్వతి, ఎస్.లక్ష్మి, శకుంతల, ఎస్.రమణమ్మ, కె.దీపు, రంబ పాల్గొన్నారు.

సాగు నీరందించాలి

పాలకొండ: పాలకొండ నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు సాగు నీరందించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. ఈమేరకు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌ను ఎమ్మెల్యే బుధవారం కలిశారు.ఈసందర్భంగా నియోజకవర్గంపరిధిలో పలు సమస్యలు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు గంటా సంతోష్, మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, నేతలు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, అప్పలనాయుడు, జాడ శ్రీధర్, వెలగవాడ శ్రీను పాల్గొన్నారు.

రాయగడలో చోరీ సొత్తు స్వాధీనం


మాట్లాడుతున్న ఎస్‌డీపీవో సేనాపతి

రాయగడ: రాయగడలోని సాయిరాం రెస్టారెంట్‌లో జరిగిన చోరీకేసును వారం రోజుల్లో పోలీసులు ఛేదించారు.ఈ మేరకు నగదు స్వాధీనం చేసుకున్నారు. రాయగడ పోలీసుస్టేషన్‌లో ఎస్‌డీపీవో రశ్మిరంజన్ సేనాపతి, ఐఐసీ కమలాకాంత్ బీకే కహర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎస్‌డీపీవో కథనం మేరకు.. రాయగడ న్యూకాలనీలోని సాయిరాం రెస్టారెంట్లో గతనెల 23 రాత్రి చోరీ జరిగింది. దీంతో రెస్టారెంట్ యజమాని ఎం.శ్రీని వాసరావు కౌంటర్‌లో ఉంచిన రూ.3 లక్షల 40 వేలు చోరీ జరిగినట్లు గతనెల 24న పోలీ సులకు ఫిర్యాదుచేశాడు.ఈ మేరకు పోలీసులు వారంరోజుల్లో ముగ్గురునిందితులను అదుపులోకి తీసుకున్నారు.ఒకరు పరారీలో ఉన్నాడు. పట్టుబడిన నిందితుల్లో కళ్యానసిం గుపూర్ సమితి టికరపాడకు చెందిన రూపేష్‌నాగ్ (21), చందిలి పోలీసస్టేషన్ పరిధి పిండపాదర్ గ్రామానికి చెందిన పంకజ్ కొండగిరి (24)గా గుర్తించారు. వీరితోపాటు ఓ బాలనేరస్థుడు ఉన్నాడు. నిందితుల నుంచి రూ.లక్షా 40 వేలు,రెండు సెల్‌ఫోన్లతోపాటు ఓ డీవీఆర్, చోరీకి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.


భవనంపై మొలిచిన పిచ్చి మొక్కలు

శ్లాబు పెచ్చులూడి..
శిథిలావస్థకు చేరి

● సిబ్బంది సమావేశాలకు వినియోగం

● ఇదీ వీరఘట్టం పీహెచ్‌సీ పరిస్థితి

వీరఘట్టం: వీరఘట్టం పీహెచ్‌సీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం పెచ్చులూడుతోంది.ఈ భవనంలోనే ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితర సమావేశాలు తరచూ నిర్వహిస్తున్నారు. కొత్తగా పీహెచ్‌సీ కార్యకలాపాలకు భవనం నిర్మించినా ప్రస్తుతం అది చాలకపోవడంతో పాత భవనం వినియోగిస్తున్నారు. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో తొలగించాలని పలువురు ఎప్పటి నుంచో కోరుతున్నారు. భవనంపై పిచ్చి మొక్కలు మెలవడంతోపాటు శ్లాబు పెచ్చులూడుతుండడంతో ఏ క్షణంలోనైనా కూలిపోతుందని పలువురు భయాందోళనచెందుతున్నారు. ఆరోగ్య సిబ్బంది సమావేశాలు నిర్వహణకు వసతులులేకపోవడంతో ఈ భవనంలోనే నిర్వహించాల్సి వస్తోంది.అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించాలని పలువురు కోరుతున్నారు.


పెచ్చులూడిన పైకప్పు

ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

● డ్వామా పీడీ రామచంద్రరావు

కురుపాం: ఉపాధిహామీ పథకం పనులు, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించడంతోపాటు అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని డ్వామా పీడీ రామచంద్రరావు హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో2023-24 ఆర్థికసంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధి పథకం ద్వారా 2,862 పనులకు గాను వేతనదారులకు రూ.16,96,43,325, మెటీరియల్‌కు రూ.7,34,07852 ఖర్చుచేశారు.పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా 20 పనులకు వేతనదారులకు 1,528 రూపాయలు, మెటీరియల్‌కోసం 8,77,04,814 రూపాయలు, గిరిజన ఇంజినీరింగ్ శాఖ ద్వారా 23 అభివృద్ధి పనులకు వేతనదారులకు 779 రూపాయలు, మెటీరియల్‌కు 18,30,76,740 రూపాయలు ఖర్చుపై సామాజిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు లేవని, క్షేత్రసహాయకులు రికార్డులు సక్రమంగా రికార్డులు నిర్వహించలేదని, పనులకు మస్తర్లకు వ్యత్యాసం ఉందని, ఒకరికి బదులు ఇంకొకరికి పనికి హాజరు, తదితర అంశాలు గుర్తించారు. ఈవిషయంపై డ్వామా పీడీ రామచంద్రరావు నివేదిక అందజేశారు. అలాగే కురుపాం పంచాయతీ పరిధిలో ఉపాధి పనులపై దర్యాప్తు నిర్వహించి ఫీల్డ్‌అసిస్టెంట్‌పై చర్యలు చేపట్టాలని, గతంలో ఫీల్డ్‌అసిస్టెంట్ పలు అక్రమాలకు పాల్పడితే ఎలా మళ్లీ ఉద్యోగంలో తీసుకున్నారని టీడీపీనాయకులు కోలారంజిత్‌కుమార్, జీవీ రమణమూర్తి, కేవీకొండయ్య డ్వామా పీడీని కోరారు. సమగ్ర దర్యాప్తు నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఎంపీడీవో అప్పారావును పీడీ రామచంద్రరావు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ సుజాత, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ దాసు, మాధవరావు, ఏపీవో పి.బావాజీ పాల్గొన్నారు.


ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కౌన్సిల్‌లో 20వ షాపుపై వాడివేడి చర్చ

సాలూరు: మునిసిపల్‌కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో పలు అంశాలపై వాడివేడి చర్చ జరిగింది. తొలుత అధికారులు ఎజెండాను చదివి వినిపించారు. పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మించనున్న అన్నక్యాంటీన్ భవనానికి కౌన్సిల్ ఆమోదించింది. మునిసిపల్ కాంప్లెక్స్‌లోని 20వనెంబర్ షాపు యజమాని అద్దె చెల్లిస్తామని చెబుతున్నా అధికారులు ఎందుకు వసూలు చేయడంలేదని వైసీపీ కౌన్సిలర్ గిరి రఘు ప్రశ్నించారు. 20వషాపు అద్దెతోపాటు మునిసిపాలిటీలో జరుగుతున్న అవకతవకలపై కలెక్టర్‌కు లేఖ రాస్తానని, ఎందుకు అధికారులు తీరు మార్చుకోవడంలేదని వైస్‌చైర్మన్ దీప్తిక మిషనర్‌పై మండిపడ్డారు. దీంతో 20వ నెంబర్ షాపుతెరవాలని పట్టుబట్టారు. దానికి కమిషనర్ ససేమిరా అనడంతో కౌన్సిలర్లు పట్టుబట్టారు. ఛైర్‌పర్సన్ వద్దు అని చెప్పినా వారు వినకపోవడంతో ఆమె వెళ్లిపోయారు. కమిషనర్ ప్రసన్న వాణి పోలీసులకు ఫోన్‌చేసి వారిని పిలిచివారి సమక్షంలో షాపు తెరవాలని మేనేజర్ రాఘవాచార్యులకు ఆదేశించారు. దీంతో కౌన్సిలర్లతో పాటు పోలీసులు,మునిసిపల్ అధికారుల సమక్షంలో 20వ నెంబర్ షాపు తాళాలు పగలగొట్టి తెరిచారు. షాపులో విలువైన ఫర్నీచర్‌తోపాటు ఏసీఉండటాన్ని గమనించారు. ఏయే వస్తువులు ఉన్నాయి, విద్యుత్‌వాడుతున్నారా లేదాఅనే విషయాన్ని అధికారులు నోట్ చేసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి వెనుదిరిగారు. కౌన్సిలర్ రాపాక మాధవరావు విద్యుత్ అధికారులు హాజరు కాకపోవడంపై ప్రశ్నించారు.కౌన్సిలర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్ఐగా శ్రీనివాసరావు వచ్చిన తర్వత ఇప్పటివరకు ఎన్ని ఇళ్ల నిర్మాణానికి ప్లాన్లకు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. మునిసిపాలిటీలో డీజిల్ ఏమవుతుందని తమకు తెలియజేయాలని మౌన్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ప్రశ్నించారు. కొంత డీజిల్‌కు సంబంధించి తనవద్ద పూర్తి సమాచారం ఉందని, కొంత డీజిల్ ఎలా మాయమైందో తనకు తెలియదని శానిటరి ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కార్య క్రమంలో టీడీపీ కౌన్సిలర్లు హర్ష, వరలక్ష్మి,బందాపు సీతమ్మలు పాల్గొన్నారు.


కమిషనర్, అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర


వినతులు స్వీకరిస్తున్న విజయచంద్ర

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: తాగునీరు తదితర సమస్యలు పరిష్కరించేందుకు చర్యలను తీసుకుంటున్నట్లు పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. బుధవారం పార్వతీపురంలో నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, బోను దేవి చంద్రమౌళి, గొట్టాపు వెంకటనాయుడు, కౌన్సిలర్ నారాయణరావు పాల్గొన్నారు.

● **పార్వతీపురంటౌన్:** పట్టణంలోని సారికి వీధిలో గల భద్రకాళీశ్వరాలయంలో బుధవారం పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలంతా శాంతి సౌభాగ్యాలతో జీవించేలని అభిషేకాలు చేశారు.

కలెక్టర్ దృష్టికి కురుపాం సమస్యలు



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం కలెక్టర్ శ్యాం ప్రసాద్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు తీసుకువెళ్లారు. ఆమెతోపాటు టీడీపీ నాయకులు దత్తి లక్ష్మణ, డొంకాడ రామకృష్ణ, జియ్యమ్మవలస ఎంపిపి సురేష్ తదితరులు కలెక్టర్‌ను కలిశారు.

డిఫ్తీరియాపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా టీకా అధికారి నారాయణ

సాలూరు రూరల్: ఏవోబీలో పార్వతీపురం మన్యం జిల్లాకు పక్కనే ఉన్న ఒడిశాలో డిఫ్తీరియా ఉనికి కన్పించిన నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా టీకా అధికారి నారాయణ కోరారు. బుధవారం తోణాం పీహెచ్‌సీ, తోణాంలో జిల్లా సర్వేలైన్స్ అధికారి జాన్‌తో కలిసి పర్యటించారు. తొలుత తోణాం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించి, టీకా కార్యక్రమాల వివరాలను వైద్యాధికారి సుజాత, వైద్యులు అజయ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీలో మరింత మెరుగ్గా టీకా కార్యక్రమం చేయించాలన్నారు. అనంతరం వైద్యసిబ్బందికి సమావేశం నిర్వహించారు.ఒడిశాలో డిఫ్తీరియా ఛాయలు కనబడడంతో ఆ రాష్ట్రానికి ఆనుకొని ఉన్న సరిహద్దు గ్రామాల్లో వ్యాధి లక్షణాలను కనిపెట్టాలన్నారు. డీపీటీ వ్యాక్సిన్ తప్పనిసరిగా అందరికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


తోణాం పీహెచ్‌సీలో పరిశీలిస్తున్న నారాయణ

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● గరుగుబిల్లి ఎంపీడీవో సూర్యనారాయణ

గరుగుబిల్లి: పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంవహిస్తే చర్యలు తప్పవని గరుగుబిల్లి ఎంపీడీవో పి.సూర్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం పింఛన్లు పంపిణీకి చర్యలు చేపట్టామని చెప్పారు. బుధవారం గరుగుబిల్లి ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావుతో కలిసి ఎంపీడీవో విలేకరులతో మాట్లాడారు. మండలానికి సంబంధించి 8,303 మంది పింఛన్‌దారులకు రూ. 3.40 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి ఇంటింటికి సచివాలయ సిబ్బంది వెళ్లి అందించనున్నట్లు చెప్పారు. నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. వైద్య చికిత్సలు పొందుతున్న వారికి మినహాయింపు ఇచ్చినట్లు చెప్పారు. పింఛన్‌దారులకు అసౌకర్యం కలగకుండా దృష్టి సారించాలని కోరారు. పింఛన్‌దారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీకి పర్యవేక్షణ అధికారులు

వీరఘట్టం: మండలంలోని గురువారం పింఛన్ల పంపిణీకి పర్యవేక్షణ అధికారులను నియమించామని ఎంపీడీవో ఎంబీటీ సుబ్రహ్మణ్యం తెలిపారు. సచివాలయ పరిధిలో ఇంటింటికి వెళ్లి అందించాలని, వందశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉదయం ఐదు గంటలకు ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉండి పింఛన్లు పంపిణీ ప్రారంభించాలని తెలిపారు.

●**సీతానగరం:** మండలంలోని కోటసీతారాంపురంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పింఛన్లు పంపిణీ చేయనున్నారని ఎంపీడీవో ఈశ్వరరావు తెలిపారు.

రుచికరమైన భోజనాలు పెట్టాలి

● ఏటీడబ్ల్యూవో చంద్రబాబు


భోజనాలు పరిశీలిస్తున్న చంద్రబాబు

కురుపాం: విద్యార్థినులకు రుచికరమైన భోజనాలువండి పెట్టాలని ఏటీడబ్ల్యూవో చంద్రబాబు ఆదేశించారు. బుధవారం కురుపాం ఏపీ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో భోజనాలను సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థినులకు నాణ్యమైన భోజనాలు పెట్టకపోవడంపై మంగళవారం తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు.ఈ నేపథ్యంలో ఐటీడీఏ పీవో మాధవన్ దర్యాప్తు నిర్వహించాలని ఏటీడబ్ల్యూవోను ఆదేశించారు.ఈసందర్భంగా విద్యార్థినులతో మధ్యాహ్నం కలిసి భోజనం చేశారు.ప్రిన్సిపాల్,వంట నిర్వాహకులకు వివరాలుఅడిగి తెలుసుకున్నారు. నివేదిక ఐటీడీఏ పీవోకు అందజేస్తామని చంద్రబాబు తెలిపారు.

దిశ డీఎస్పీకి బదిలీ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం మన్యం జిల్లా దిశ డీఎస్పీ హర్షితకు బదిలీ అయ్యింది. తిరుపతికి డీఎస్ఆర్పీగా నియమిస్తూ.. ఉన్నతాధికారులు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆమె స్థానంలో ఇక్కడకు ఎవరు వస్తున్నార్నది తెలియజేయలేదు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గంట్యాడ: ప్రస్తుతం సీజనల్ వ్యాదులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి భాస్కరరావు సూచించారు. బుధవారం గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్రై డేను పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎరువులకు కొరత సృష్టించవద్దు

దత్తిరాజేరు: ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులను విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దత్తిరాజేరు ఏవో అనూరాధ హెచ్చరించారు. బుధవారం మండలంలోని మానాపురంలోని కొల్ల నరసింహస్వామి అండ్ సన్స్ ఎరువుల షాపులో స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్, గోడౌనును తనిఖీ చేశారు. ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని తెలిపారు. ఎరువులన్నాత పరిశీలనను సాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఆమె వెంట వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ఏబీ రోడ్డు అధ్వానం

● భారీ వాహనాలతో ఇబ్బందులు


భామిని వద్ద రోడ్డుపై నిలిచిపోయిన భారీవాహనం

భామిని: మండలంలోని అలికాం-బత్తిలి రోడ్డు అధ్వానంగా మారింది. దీనికితోడు ఈ రోడ్డులో భారీ వాహనాల రాకపోకల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుండడంతో అవస్థలు తప్పడం లేదు. కొన్నిచోట్ల గోతుల్లో వాహనాలు దిగబడిపోతున్నాయి. బత్తిలి-కొత్తూరు మధ్య 30 కిలోమీటర్లు అడుగడుగునా గోతులు కావడంతోపాటు చత్తీస్‌ఘడ్ నుంచి విశాఖ, విశాఖ నుంచి చత్తీస్‌ఘడ్‌కు భారీవాహనాలు రాకపోకల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే గోతులు పూడ్చాలని పలువురు, భారీ వాహనాలకు దారి మళ్లించాలని పలువురు కోరుతున్నారు.

టర్నోవర్ పెరగాలి

● జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర


గోదాము పరిశీలిస్తున్న మహేంద్ర

గుమ్మలక్ష్మీపురం: వ్యాపారాన్ని మెరుగుపరచుకోవాలని,టర్నోవర్ పెరగాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర ఆదేశించారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార సంస్థ కార్యాలయాన్ని, డీఆర్ డిపోలు, పెట్రోల్ బంకులు తనిఖీలు చేశారు.ఈసందర్భంగా స్టాక్ బ్యాలెన్స్ రికార్డులను పరిశీలించారు. డీజిల్ ఇతర నిత్యావసర సరుకులు అందించాలని ఆదేశించారు. సమస్త వ్యాపారాన్ని మెరుగుపర్చుకోవాలని టర్న్ అవర్ పెరగాలని ఆదేశించారు. ఆయన వెంట జీసీసీ మేనేజర్ కృష్ణ ప్రసాద్, సూపరింటెండెంట్ సాంబశివరావు తదితరులు ఉన్నారు.

రాజా సత్యహరిశ్చంద్ర విగ్రహావిష్కరణ

సాలూరు రూరల్: సాలూరు స్వర్గధామంలో రాజా సత్యహరిశ్చంద్ర విగ్రహాన్ని బుధవారం స్వర్గధామం కమి టీ చైర్మన్, ప్రముఖ వైద్యుడు వాడాడ గణేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సుతా పల్లి రామమూర్తి, నాగోలు తాతాజీన్యాయవాది వడ్డాది షణ్ముఖముత్యాలు,మండా చంద్ర పాల్గొన్నారు.

కుక్కలను అరికట్టేందుకు చర్యలు

పాచిపెంట: కుక్కలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు కుక్కల దాడుల నుంచి కాపాడేందుకు బుధవారం పాచిపెంటలో సంబంధిత అధికారుల అనుమతితో పంచాయతీ ఆధ్వర్యంలో కుక్కలను పట్టి దూరప్రాంతాలకు తరలించారు. గతనెల 16న పాచిపెంటకు చెందిన మూడేళ్ల చిన్నారి కె.సింహాసినిపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన విషయంవిదితమే. ఈమేరకు గ్రామస్థులు ఆందోళననేపథ్యంలో ఎంపీడీవో పి.లక్ష్మికాంత్, వెటర్నరీవైద్యాధికారి మంచాల వెంకటరమణ, డీఎంహెచ్‌వో సమన్వయంతో పాచిపెంట పంచాయతీ సర్పంచ్ పి.సంతోషికి కుక్కలు పట్టివేత గురించి ఆదేశించారు.